క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



పిట్లం(జుక్కల్): అర్హులైన రైతులందరు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని చిన్నకొడప్‌గల్ క్లస్టర్ వ్యవసాయ విస్తర్ణ అధికారి సురేష్ పేర్కొన్నారు. ఆయన మండలంలోని ధర్మారం గ్రామంలో సోమవారం రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ సోమవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. టౌన్ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నగేష్, రామాగౌడ్, నవీద్ తదితరులున్నారు.

చెట్లకిందికి క్షవర దుకాణాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మెదక్–రుద్రూర్ వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం కావడంతో చిరు దుకాణాదారులు రోడ్డున పడ్డారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకావడంతో ఇప్పటి వరకు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను తొలగింపజేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది వారి దుకాణాలను రోడ్డుపక్కన ఉన్న చెట్ల కింద తాత్కాలికం ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణులు వారి దుకాణాలను సామూహికంగా రోడ్డుపక్కనే ఉన్న ఓ చెట్టు కింద ఏర్పాటు చేసుకొని కటింగ్ చేస్తున్నారు.

జీపీలకు భవనాలు కరువు

- పాఠశాల వరండాలు, గదుల్లో పాలన
- పట్టించుకోని పాలకులు



ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న గిర్నితండా గ్రామ పంచాయతీ



కుబ్యానాయక్ తండాలోని ప్రభుత్వ పాఠశాల వరండాలో కొనసాగుతున్న గ్రామసభ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్) : జిల్లాలో అనుబంధ గ్రామాలు, 500 జనాభా కలిగిన గిరిజన తండాలను జీపీలుగా ఏర్పాటు చేసి ఐదేళ్లయినా కార్యాలయాలకు సొంత భవనాలు లేక సిబ్బంది, దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆయా పంచాయతీల్లో నేటికి ఇంకా చెట్ల కింద, వరండాల్లో, ఆరోగ్య ఉప కేంద్రాలు, అద్దె భవనాల్లో పంచాయతీల పరిపాలన కొనసాగి స్తున్నారు.

పెద్ద కొడప్‌గల్ మండలం కుబ్యానాయక్ తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వరండాను పంచాయతీ కార్యాలయంగా వినియోగిస్తుండగా అక్కడి గదిలో పాఠశాల కొనసాగుతోంది. గ్రామ సభలతో పాటు పంచాయతీ పాలకవర్గం సమావేశాలు వరండాలో చేపడుతూ రికార్డులను మాత్రం పాఠశాల గదిలో భద్ర పరుస్తున్నారు. కుబ్యానాయక్ తండా జీపీగా ఏర్పాటై ఐదేళ్లు గడిచి సర్పంచ్‌ల పదవి కాలం ముగిసినా సొంత భవనానికి నోచుకోలేదు. అలాగే మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పాటైంది. సదరు గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్ర భవనంలో పంచాయతీ కార్యాలయం కొనసాగుతుంది. ఈ సమస్య కుబ్యానాయక్, గిర్ని తండా గ్రామ పంచాయతీలది కాదు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా పంచాయతీలుగా ఏర్పాటైన గిరిజన తండాలతో పాటు అనుబంధ గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవు. గ్రామ పంచాయతీ సొంతభవనాలు లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. అన్ని గ్రామ పంచాయతీలకు కార్యదర్శుల నియామకంతో పాటు పంచాయతీల పాలనకు ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లను ప్రభుత్వం సమకూర్చింది. కాని గ్రామ పంచాయతీలకు సొంతభవనాలను మంజూరు చేయకపోవడంతో పంచాయతీల పాలన అగమ్యగోచరంగా మారింది.

మొబైల్ వ్యాన్‌లోనే పాస్‌పోర్ట్ సేవలు



కామారెడ్డి హెడ్‌పోస్టాఫీస్ ఆవరణలో వాహనం ద్వారా పాస్‌పోర్టు సేవలు అందిస్తున్న సిబ్బంది



దహనమైన కామారెడ్డి పాస్‌పోర్టు సేవా కేంద్రం (ఫైల్)

- గతంలో దహనమైన పాస్‌పోర్టు సేవా కేంద్రం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి హెడ్‌పోస్టాఫీస్‌లోని పాస్‌పోర్టు సేవా కేంద్రం సేవలు మొబైల్ వ్యాన్ ద్వారా కొనసాగుతుండడంతో పాస్‌పోర్టు సేవల కోసం వచ్చే వారు ఇబ్బందులకు పడుతున్నారు. హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు కేంద్రం పరిధిలో జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ కృషితో కామారెడ్డి పోస్టాఫీసులో పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఐదేళ్ల క్రితం ప్రారంభించగా ప్రతి రోజు 40 మందికి స్లాట్ కేటాయించి సేవలు అందిస్తున్నారు. గత ఫిబవరి 24న ప్రమాదవశాత్తుగా అంటుకున్న మంటలతో పాస్‌పోర్టు సేవా కేంద్రం భవనం పూర్తిగా దహనమైంది. దీంతో పాస్‌పోర్టు సేవలకు అంతరాయం కల్గింది. పలువురి విజ్ఞప్తి మేరకు ఈశాన్య రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్న విధంగా కామారెడ్డికి గత ఏప్రిల్ 15 నుంచి మొబైల్ వ్యాన్‌ను కేటాయించారు. మొబైల్ వ్యాన్‌తో పాస్‌పోర్టు సేవలు అందిస్తున్నప్పటికి స్లాట్ బుక్ చేసుకున్న 40 మంది, వారి బంధువులతో దాదాపు 100 నుంచి 200 మంది వ్యాన్ బయట బయట వేచి ఉండాల్సి వస్తుండడం ఇబ్బందిగా ఉంది. మరుగుదొడ్లు, నీటి వసతి, కూర్చోవడానికి అనుకూలంగా బెంచీలు లేక ఇబ్బందులు పడుతున్నారు.


కాలిపోయిన పాస్‌పోర్టు సేవా కేంద్రం స్థానంలో కొత్తగా భవనం నిర్మించాల్సిఉండగా ఎవరూ పట్టించుకోవట్లేదని తెలుస్తుంది. ప్రస్తుత జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ద్వారా పాస్‌పోస్టు సేవా కేంద్ర భవనానికి నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు. పాస్‌పోర్టు సేవల్లో లోపం లేకున్నా వచ్చిన వారికి భవనం లేక ఇబ్బందులున్నందున పోస్టల్ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సింది.

రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



బాన్సువాడ : రిటైర్ అయిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు శంకర్ అన్నారు. సోమవారం బాన్సువాడలో రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. 2019 నుంచి ఇప్పటి వరకు రిటైర్ట్ అయిన ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన రిటైర్‌మెంట్ డబ్బులు ఇప్పటి వరకు రావడం లేదని, యాజమాన్యం స్పందించిన వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలని సూచించారు. రిటైర్ అయి మృతిచెందిన కార్మికులకు రావాల్సిన చావు ఖర్చులు అదే రోజు చెల్లించాలన్నారు. రిటైర్‌మెంట్ కార్మికులకు ప్రతి నెలా రూ.7500 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులు మహమూద్, నాగ్‌నాథ్, ఫరీద్, పండరి, సిరాజుల్లా, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వార్థం కోసమే పోచారం పార్టీ మారారు



ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు బిల్లులు మంజూరు చేయించిన చెక్కును చూపుతున్న నాయకులు

బాన్సువాడ : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన స్వార్థం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల బాన్సువాడలో డబుల్ బెడ్ రూం ఇళ్ల బిల్లులు పంచుతూ తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఎమ్మెల్యే చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. పోచారం నియోజకవర్గం అభివృద్ధి కోసం కాదు తన కుటుంబ సభ్యుల బిల్లుల కోసమే పార్టీ మారారన్నారు. అందుకు సంబంధించిన బిల్లుల చెక్కులను చూపించారు. నియోజకవర్గంలో ఎంతోమంది సర్పంచులు, ఎంపీటీసీలు, కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే మాత్రం తన కుటుంబ సభ్యులకే ముందు బిల్లులు ఇప్పించుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎలమంచిలి శ్రీనివాస్‌రావు, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్ దేశాయ్, శివరాజ్, హన్మాండ్లు, కమలాకర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



భిక్కనూరు : అవయవదానం చేసిన పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్ కుటుంబానికి పారిశ్రామికవేత్త ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి రూ. 20వేల ఆర్థికసాయం సోమవారం అందజేశారు. ప్రవీణ్ కుటుంబం నివసిస్తున్న ఇంటి పైకప్పు సరిగా లేకపోవడంతో వర్షం నీళ్లు లోపలికి వస్తున్నట్లు తెలుసుకున్న ఆయన ఇంటిపైకప్పు కోసం రూ. 20వేల తమ సంస్థ ప్రతినిధుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పెద్ద మల్లారెడ్డి సింగిల్‌విండో చైర్మన్ రాజాగౌడ్, ఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సతీష్‌రెడ్డి, సాయగౌడ్, స్వామిగౌడ్, సుదర్శన్‌గౌడ్, రవీందర్‌గౌడ్, బీబీపేట మాజీ వైఎస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జనగామ మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్ తదితరులున్నారు.

షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నిజాంసాగర్(జుక్కల్): అపరిచిత వ్యక్తుల వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో బాలికలు షీటీం సేవలను ఉపయోగించుకోవాలని ఎస్సై సుధాకర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో షీటీం, సైబర్ క్రైం సేవలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు బస్టాండ్ ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలల ఆవరణలో వేధింపులకు గురైతే వెంటనే 100కు ఫోన్ చేయాలన్నారు. అంతేకాకుండా సెల్ ఫోన్లలో వచ్చే ఎస్సెమ్మెస్‌లకు రిప్లై ఇవ్వొదన్నారు. జిల్లా పోలీస్ కళాజాత నిర్వాహకుడు ప్రభాకర్, సైబర్ క్రైమ్ పోలీసలు శ్యాం, సాయిలు, కస్తూర్బా టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం హరిహర కాలనీ(జీవీఎస్ కళాశాల వెనుక) శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన హరితహారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్ ఎస్ వనిత పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం పిల్లల కోసం స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాంమోహన్, ఆలయ కమిటీ అధ్యక్షుడుం చెన్నరాజు, ప్రతినిధులు బి అనిల్‌యాదవ్, జుగల్‌కిషోర్, మధుసూదన్‌రావు, శ్యాంరావు, జి నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్‌లో..



మహమ్మద్ నగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని మహమ్మద్ నగర్, సింగితం అటవీశాఖ బీట్‌ల పరిధిలో సోమవారం అటవీశాఖ అధికారి శ్రీనివాస్ మొక్కలు నాటారు. మహమ్మద్‌నగర్ బీట్‌లోని 295 కంపార్ట్ మెంట్లలోని 5 హెక్టార్లల్లో గ్యాప్ ప్లాంటేషన్‌లో 850 మొక్కలను రిప్లాంటేషన్ చేశామని బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. మిగితా కంపార్ట్ మెంట్లల్లో వన మహోత్స కార్యక్రమం జరుగుతుందన్నారు.

కళ్యాణి వాగుపై వంతెన కలేనా..?

- వాగు ప్రవాహంతో కళ్యాణి, రత్నాపూర్ గ్రామస్తులకు ఇబ్బందులు
- 10 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి



కల్యాణి వాగు దాటుతున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి గ్రామంలో కళ్యాణి వాగుపై వంతెన లేక పోవడంతో వర్షాకాలంలో కల్యాణి, రత్నాపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగు ప్రవహించే సమయంలో వాగులో నుంచి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని ఇరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు చేపట్టడంలో జరుగుతున్న జాప్యం లేకుండా చూసి కళ్యాణి వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

2.కి.మీ ప్రయాణానికి..

ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామం నుంచి రత్నాపూర్ గ్రామానికి వాగు మధ్యలోంచి దారి ఉంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు వర్షాలు కురవడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఇరు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కళ్యాణి గ్రామానికి చెందిన రైతుల పొలాలన్ని రత్నాపూర్ శివారులో ఉండడంతో వారు వారి పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. రత్నాపూర్ ప్రజలు సైతం ప్రతి పనికి వారు ఎల్లారెడ్డికి కళ్యాణి గ్రామం మీదుగా వస్తారు. వీరు కూడా వాగు మధ్యలోంచి వచ్చేందుకు ఇబ్బందులు పడడంతో పాటు రత్నాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల వరకు మాత్రమే ఉండడంతో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునేందుకు కళ్యాణి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు రావాల్సి ఉంటుంది. గ్రామానికి చెందిన విద్యార్థులు రత్నాపూర్ నుంచి కళ్యాణి గ్రామానికి వాగు మీదుగా రావాలంటే కేవలం 2 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది.

వాగు వచ్చిందంటే రేషన్ బియ్యానికి అవస్థలే..

తిమ్మారెడ్డితండా మీదుగా చుట్టు తిరిగి 10 కి.మీ మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రత్నాపూర్ ప్రజలు రేషన్ బియ్యం కోసం సైతం కళ్యాణికి రావాల్సి వస్తుండడంతో వర్షాకాలంలో వాగు వల్ల ఇబ్బందులు పడుతున్నామని వారు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల క్రితం వాగు ఉధృతంగా ఉన్న సమయంలో వాగు దాటి వెళ్తున్న ఇద్దరు యువకులు కొట్టుకుపోయారు. పశువులు కొట్టుకుపోఇన సంఘటనలు అనేకం ఉన్నాయి.

ప్రారంభం కాని పనులు..

ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి వాగుపై వంతెన నిర్మాణానికి రూ. 2.70 కోట్లు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నిధులను మంజూరు చేయించారు. వంతెన నిర్మాణ పనులకు టెండర్లు నిర్వహించిన ఎవరు ముందుకు రాక పోవడంతో పనుల నిర్మాణంలో జాప్యం జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

ఇబ్బందిగా ఉంది..



కళ్యాణి గ్రామానికి చెందిన వారి పంట పొలాలు రత్నాపూర్ గ్రామ శివారులో ఉన్నాయి. వాగు వచ్చిన సమయంలో వాగులో నుంచి పోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. 2 కిలో మీటర్ల దూరానికి పది కిలో మీటర్ల దూరం తిరిగి వెళ్ళాల్సి ఉంటుంది.

– రవీందర్, రైతు, కళ్యాణి

కూలీ పనులకు వెళ్లాలంటే..



పొలంలో కూలీ పనులకు వెళ్లాలంటే వాగు వచ్చిన సమయంలో ఇబ్బందిగా ఉంటుంది. కిలోమీటర్ పరిధిలో ఉన్న పొలంలో పనులకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది.

– కాశీరాం, వ్యవసాయ కూలీ, కళ్యాణి

నిధులు మంజూరయ్యాయి

కళ్యాణి వాగుపై వంతెన నిర్మాణానికి గాను ప్రభుత్వం రూ. 2.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. వంతెన నిర్మాణ పనులకు టెండర్లు నిర్వహించాం. టెండర్లు ఎవరు వేయకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మరోమారు టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలను తీసుకుంటాం.

– గిరిధర్, పంచాయతీరాజ్ డీఈ, ఎల్లారెడ్డి

ఆధ్యాత్మికం

శివాలయంలో ప్రత్యేక పూజలు



పిట్లం(జుక్కల్) : మండలంలోని రాజన్న కుంట శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన చేశారు.

మహంకాళి అమ్మవారికి బోనం



భిక్కనూరు : మండల కేంద్రంలోని మహంకాళి అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా పలువురు తొట్ల బోనంను సోమవారం సమర్పించారు. ప్రత్యేకంగా తయారు చేసిన చిన్న బండిని రకరకాల కాగితాలతో చీరలతో అలంకరించి దానిపై తొట్లను పెట్టి దాని పైన బోనంను పెట్టి భాజాభజంత్రీలతో మండల కేంద్రంలో ఊరేగించి మహంకాళి అమ్మవారికి ఆలయం వద్దకు తీసుకవచ్చి సమర్పించారు. ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఇసన్నపల్లిలో..



భిక్కనూరు : మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో బోనాల పండగను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటివారు గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. దారిపొడవున పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు అలరించాయి. గ్రామదేవతలకు బోనాలతో పాటు నైవేద్యాన్ని సమర్పించారు. పంటలు బాగా పండాలని వానలు బాగాకురియాలని గ్రామస్తులు మొక్కుకున్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని పలు వీధుల్లో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించినట్లు కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తెలిపారు. వీధుల్లోని మురికి కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తీత, పిచ్చి మొక్కలను తొలగించారు. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు మురికి కాల్వలు, మురికినీరు నిలిచిన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేయించారు. జీపీ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల విద్యావనరుల కార్యాలయంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా గాదారి రాజిరెడ్డి(సదాశివనగర్), ప్రధానకార్యదర్శిగా బసంత్ రాజ్, ఉపాధ్యక్షులుగా బాల్‌కిషన్ రావు, కార్యదర్శిగా సాయిరెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలిగా సువర్ణ, కార్యదర్శిగా ప్రశాంతిలను ఎన్నుకున్నారు.

ఎల్ఐసీలో అనుబంధ సంఘం ఆవిర్భావం



బ్లియాస్ సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న జోనల్ నాయకులు

కామారెడ్డి అర్బన్ : సౌత్‌సెంట్రల్ జోనల్ (ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణ) బ్లియాస్ అధ్యక్షుడు ఫణింద్రకుమార్, గౌరవ అధ్యక్షుడు సంపత్‌రావులు ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బ్లియాస్ కామారెడ్డి శాఖ కార్యవర్గాన్ని ప్రకటించారు. సమావేశంలో బ్లియాస్ జోనల్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, సికింద్రాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు కే.లక్ష్మారెడ్డి, బిఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రావుల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి శాఖ కార్యవర్గం

బ్లియాస్ కామారెడ్డి శాఖ నూతన అధ్యక్షుడిగా రాంశెట్టి శేఖర్, గౌరవ అధ్యక్షుడుగా హరాలే శివాజీరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.విశ్వనాథం, భూంరావు, కార్యదర్శిగా సామల సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎల్ నరేష్, కోశాధికారిగా సీహెచ్ శంకర్, సికింద్రాబాద్ డివిజన్ కార్యవర్గసభ్యుడిగా రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షిప్తం

నేడు రెండో విడత రైతు రుణమాఫీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నేడు రైతులకు సంబంధించిన రెండో విడత రైతు రుణమాఫీ జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీన మొదటి విడతలో రైతులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. లక్ష వరకు రుణమాఫీ చేయగా నేడు లక్షన్నర వరకు సంబంధించిన రైతుల రుణమాఫీ జరుగుతుందన్నారు. వచ్చేనెల 15వ తేది లేదా నెలాఖరు వరకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందన్నారు.

పెన్షనర్ల మౌనదీక్షకు తరలిరావాలి

కామారెడ్డి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మౌనదీక్షకు విశ్రాంత ఉద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని పెన్షనర్ల జేఏసీ సలహాదారు జి లచ్చయ్య పిలుపునిచ్చారు. ఇందిరా పార్క్ వద్ద మంగవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మౌనదీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన మాజీ ఎమ్మెల్యే..



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కొద్ది రోజులుగా అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందిన సురేందర్ పూర్తిగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు వారు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయానికి జీపీల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని ఇన్‌చార్జి గ్రంథపాలకుడు రాజలింగం కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఆయా ఇళ్ల నుంచి వసూలు చేసిన బిల్లుల్లో 8శాతం గ్రాంట్ గ్రంథాలయానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18 జీపీలకు గాను గ్రంథాలయానికి రూ. 10లక్షల మేర బకాయిలు రావాల్సి ఉందన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ రికవరీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని కాటేపల్లి తండాకు చెందిన బర్దవల్ మంగళ్ సింగ్ తన ఫోన్‌ను పెద్దకొడప్‌గల్‌కు వస్తుండగా మార్గమధ్యలో పోగొట్టుకోగా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను పోలీసులు ట్రేస్‌చేసి సోమవారం ఎస్సై మహేందర్ మంగళ్‌సింగ్‌కు అందజేశారు.

ఆర్యవైశ్య మండల అధ్యక్షుడిగా వంగపల్లి యోగేశ్



మద్నూర్(జుక్కల్) : ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా మద్నూర్‌కు చెందిన వంగపల్లివార్ యోగేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్యవైశ్యులు సోమవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా యోగేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా సంతోష్ బున్నావార్, ప్రధాన కార్యదర్శిగా సురేశ్ ఉడతావార్, కోశాధికారిగా అనుప్ పోలావార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు రాజుసేట్, సతీష్ సేట్, సంతోష్, భాను, అజయ్, సురేష్, సునీల్, సంజు తదితరులున్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ జెడ్పీటీసీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మాజీమంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిశారు. గ్రామపంచాయతీలతో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా అసెంబ్లీలో మాట్లాడాలని ఆయన కేటీఆర్‌ను కోరారు.